తెలుగు కళానమితి (న్యూజెర్సీ) కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# రౌడీ(!)



— రాధా బాలకృష్ణ

ఆ టైముకి అలా కిటికీ దగ్గర కూర్చుని, భర్త కోసం ఎదురుచూడడం సీతకి ఓ ముచ్చటయిన అలవాటు. హీరోహోండా ముందు వక్రం వీధి మలుపు తిరగడం ఆమె కంటబడుతూనే ఆమె ప్రతి అవయవం ఆనందంతో స్పందిస్తుంది. ఆమె ముఖం కార్తీకంలో రెల్లుపొదలా పొంగిపోతుంది. రోజూ అయిదున్నరకి ఓ అరనిముషం అటుయిటుగా ఆ వక్రం అలా వీధి మలుపు తిరగాల్సిందే!

కానీ, ఈ రోజు అయిదున్నరయి అరగంటయ్యింది- భర్త జాడలేదు. తెల్లారితే తన పుట్టిన్రోజు- తనకి మంచి గౌను కొంటానన్నాడు తను ముస్తాబై కూర్చుంది.. సీత మనస్సు ఆందోళన చెందుతోంది.

ఆరుంపావు...

గాభరాతో, శంకతో ఎరుపెక్కుతూన్న సీత కళ్లు తళుక్కున మెరిసాయి. హృదయం ఝల్లుమంది. వక్రం వీధి మలుపు తిరిగింది. గభాలున తలుపులు తెరచి వీధి గుమ్మం దగ్గరికి పరిగెత్తిన సీత- చిన్న చిన్న దెబ్బలతో నలిగిన బట్టలతో వున్న భర్తని చూస్తూనే నిస్తుపోయింది!

"లోపలికి పద- చెబ్తాను" అన్నాడు వెంకట్రావు సీతతో, చిన్నగా నవ్వి.

అతని దెబ్బలవైపు బాధగా చూస్తూ, వేగంగా కొట్టుకుంటూన్న గుండెల్తో అతనిని అనుసరించి లోపలికి నడిచింది సీత.

"సీతా- ఈవాళో చిన్న అడ్వెంచర్ చేయాల్సొచ్చింది. లలిత అని మా కొలీగ్ ఒంటరిగా బస్టాండ్‌లో నిల్చుంటే ఇద్దరు బజారు రౌడీలు ఆమెని ఆటపట్టించి, ఏడిపిస్తున్నారు. సమయానికి నేను అటు వస్తూ, పరిస్థితి గమనించి, వాళ్లతో తలపడ్డాను. ఇద్దరుండడంతో కొంచెం కష్టపడ్డాముగాని, మొత్తానికి వెధవలు తన్నులు తిని, కాళ్లకు బుద్ధి చెప్పారు.."

సీత అప్రయత్నంగానే భర్తకి దగ్గరయ్యింది. అతని దెబ్బల ప్రక్కన మెత్తగా నున్నాలా చుట్టిన గులాబీ పెదవుల మధ్యగా వూదుతూ వుపశమనం కలిగించి, అతని కళ్లల్లోకి ఆరాధనగా చూసింది.

వెంకట్రావు గుండెలు వుప్పొంగాయి.

శరీరం కంచు విగ్రహంలా బిగుసుకుంది.

కించిత్ గర్వం అతని కళ్లల్లో పాకింది.

భార్య చెంపల మీద మెత్తగా మీటి, నుదుట కుంకుమ బొట్టుపైన చుంబించి, ఆమె చేతి గాజులను గలగలలాడించి, ఆమె భుజాలమీదుగా జడలోని మల్లెల సువాసనని ఆఘ్రాణించి, "పాపం- మీ లేడీస్‌కి, వాళ్లతో సమానమయిన బలం వుండదు కాబట్టే, వాళ్లని ఎదుర్కొనే ధైర్యం కూడా మీకు వుండదు కాబట్టే కదా, ఆ స్కౌండ్రల్స్ యిలాంటి దౌర్జన్యానికి దిగేది?!" అన్నాడు వెంకట్రావు జాలిగా.

"అవునూ- వాళ్లతో అంత ధైర్యంగా తలపడ్డారుగదా- మీకు ఫైటింగొచ్చా?" అని అమాయకంగా అడుగుతున్న భార్య కళ్ళల్లోకి హీరోలా చూస్తూ అన్నాడు వెంకట్రావు- "అన్నీ ఆలోచించుకుని రంగంలోకి దిగే వాడు హీరో కాలేడు!"

నవ్వేసింది సీత కిలకిలా.

"ఓకే- ఒక్క ఫైవ్ మినిట్స్‌లో తయారవుతామా- మనం బజారుకెళ్తున్నాం- నీ బర్త్‌డే ప్రెజెంటేషన్ కొంటున్నాం. ఈ కోమలాంగి రేపు అది ధరించి మాకు ఆనందాన్ని కలిగిస్తుంది" అంటూ డ్రెస్ ఛేంజ్ చేసుకో సాగాడు వెంకట్రావ్ హుషారుగా.

* * *

సమయం అయిదున్నర-

ఇంటి ముందాగింది హీరోహోండా-

కానీ కిటికీ దగ్గర సీతలేదు!

ఇంటికి తాళం పెట్టివుంది!!

ఆశ్చర్యపోయాడు వెంకట్రావు!!

'అరె- ఈ టైములో ఎక్కడికి వెళ్లింది చెప్మా? అందులో బజారుకెళ్దాం అనుకున్నాం- రేపు ఫస్ట్ వెడ్డింగ్ డే- నా డ్రెస్ రెడీగా వుంది- తనకి శారీ కొంటానన్నాను' అనుకుంటూ, వీధి పొడవునా చూసిన వెంకట్రావు కళ్లల్లో- చేతిలో కూరగాయల సంచీతో వస్తూన్న సీత పడింది!

భర్తని చూస్తూనే మరింత వేగంగా నడుచుకు వచ్చిన సీత, "సారీ అండీ- బజారు నుంచి రావడం లేటయ్యింది" అంటూ తాళం తీసింది.

"అదేమిటే, అంత అలసటగా కనిపిస్తున్నావు? అరె, ఆ జుట్టేమిటే అంతలా చెదిరిపోయిందీ- ఇలాగేనా బజారుకెళ్లేదీ.." అంటూ మెత్తగా కోప్పడుతూన్న భర్తని వారిస్తూ దగ్గరకు చేరి, "ఆ.. ఏంలేదండీ- వెళ్లేటప్పుడు నీట్‌గానే వెళ్లాను- వచ్చేటప్పుడు తప్పనిసరయి చిన్న ఫైటింగయ్యిందంతే" అంది సీత.

"కూరగాయల వాడితోనా- ఏంక్లికిలో అంటూ పది గ్రాముల కంకర్రాయి పెట్టి తూచాడా?" నవ్వాడు వెంకట్రావు.

"కాదు- కూరలు తీసుకొస్తూంటే, ఈ వీధి మలుపులో ముగ్గురు పోకిరీ వెధవలు ఒంటరిదాన్ని చేసి, దౌర్జన్యం చెయ్యబోయారు- నా గురించి తెలియదు వెధవలకి- పాపం, హాస్పిటల్‌కి పోయారు.."

"ఏమిటే- జోకా?!" అనుమానంగా నవ్వాడు.

"కాదండీ- నిజం!"

"ఏమిటి సీతా నువ్వనేది- ఏంచేశావు?!"

"నన్ను చూసి ఎదురుతిరిగే రకం కాదులే అనుకుంటారు. ఆ రౌడీ వెధవల మొగతనం చూసి భయపడి పరిగెత్తిపోతాననుకున్నారు. చెంగు నడుమున చెక్కి, చీరె గోచీ పోసి కలబడే సరికి..." అంటూ నవ్వుతూ, భర్త అభినందనల్ని అందుకోవడానికి అతని ముఖంలోకి చూసిన సీత- కత్తివేటుకి రక్తపు చుక్కలేని అతని ముఖాన్ని పరికించి చూస్తూ, ఆశ్చర్యపోయి, "ఆ యిడియట్స్ నన్ను కిడ్నాప్ చేసుకునిపోవడానికి ప్రయత్నించారండీ- కారు కూడా రెడీగా..." తన మాటలు వినకుండా బయటికి నడుస్తూన్న భర్త వెంటపడి, "వదిలెయ్యండి ఆ విషయం- బజారుకెళ్దాం అన్నారుగా- అయిదు నిమిషాల్లో తయారైపోతాను- ఏం!" అంది.

"ఏం అక్కర్లేదు" అన్నాడు వెంకట్రావు ఖచ్చితంగా.

"అదేం- రేపు మన వెడ్డింగ్ డే కదా- నాకు చీర కొన్రూ?"

"చీర కాదు- నీ క్కావాల్సింది- ప్యాంటు, షర్టు- రౌడీ" కటువుగా అని, విసురుగా బయటికి వెళ్ళిపోతూన్న భర్తవైపు హతాశురాలయి చూస్తూన్న సీత కళ్లల్లో మరో నిముషానికి నీళ్లు సుళ్లు తిరిగాయి. ●